## క్లుప్తంగా

### లాభాల బాటలో ప్రియదర్శిని బ్యాంక్



మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి

ఆదోని అర్బన్: ప్రియదర్శిని అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ ఈ యేడాది లాభాల బాటలో ముందుకెళ్తోందని చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆదోని పట్టణంలోని ఆ బ్యాంక్ కాన్ఫరెన్స్ హాల్‌లో 27వ సర్వసభ్య సమావేశం చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సంవత్సరం బ్యాంకు ఆదాయ, వ్యయం, ఆస్తులు, అప్పులు, తదితర వివరాలను సభ్యుల ముందు చైర్మన్ చదివి వినిపించారు. మూల ధనం రూ.1.77 కోట్లు, డిపాజిట్‌లు రూ.53.59 కోట్లు, రుణాలు రూ.30.20 కోట్లు, గ్రాస్ ఎన్‌పీఏ 3.60 శాతం, నెట్ ఎన్‌పీఏ 0 శాతం, లాభం రూ.96.40 లక్షలుగా ఉందన్నారు. ఈ సంవత్సరానికి గానూ డివిడెండ్ 9 శాతం వాటా మూలధనంపై చెల్లించాలని సభ ఆమోదించినట్లు తెలిపారు. వైస్ చైర్మన్ లక్ష్మణరావు, డైరెక్టర్లు జి.పి.దర్శనలాల్, కె.దీపక్, దశరథరామిరెడ్డి, సీఈఓ రమేష్ పాల్గొన్నారు.

### వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు విరాళం



విరాళం అందిస్తున్న వాల్మీకి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం నాయకులు

ఆదోని సెంట్రల్: ఆదోని మండలం దొడ్డనగేరి గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహం ఏర్పాటుకు వాల్మీకి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం సభ్యులు విరాళం అందించారు. వాల్మీకి సంఘం నాయకులు రామలింగప్ప, వెంకన్న, నరసయ్య,సత్యన్న, నాగన్న తదితరులు ఆదివారం దొడ్డనగేరి వాల్మీకి విగ్రహ కమిటీ సభ్యులైన ఈరన్న, తలారి గోవిందు, ఉరుకుందప్ప, లేపన్న, రాజుకు రూ.20 వేలు నగదు అందించారు. అలాగే విగ్రహం ఏర్పాటుకు తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. సంఘం నాయకులు వెంకటరెడ్డి, సుధాకర్ బాబు, భీమరాజు, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

### రోటరీ క్లబ్ సభ్యుల ఎన్నిక



ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులతో రోటరీ క్లబ్ సభ్యులు

ఆదోని అర్బన్: ఆదోని రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా సందీప్‌రెడ్డి, డాక్టర్ సైఫుల్లాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జూబ్లీ హాల్‌లో రోటరీ క్లబ్ సమావేశం డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.కె. రవీంద్ర ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ దశరథరామిరెడ్డి, ముఖ్య అతిథిగా ఖాజీ అల్తాఫ్‌హుసేన్ హాజరయ్యారు. రోటరీ క్లబ్ ఆదోని నూతన అధ్యక్ష కార్యదర్శులుగా సందీప్‌రెడ్డి, డాక్టర్ సైఫుల్లా, ట్రెజరర్‌గా వికాస్‌బండారితో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న సేవా కార్యక్రమాలను వివరించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. సభ్యులు భరత్ షా, విట్టా మురళీ, జీవన్‌సింగ్, ప్రశాంత్‌గాంధీ, సునీల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాహోటి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు స్వామి వారి మూల విరాట్‌లకు సుప్రభాతం సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు భక్తులు అన్నదానం చేశారు.

### రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ సునీల్‌కుమార్

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని రౌడీషీటర్లు, మట్కా నిర్వాహకులకు ఆదివారం ఎస్‌ఐ సునీల్‌కుమార్ తన కార్యాలయం ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు బుద్ధిగా ఉండాలని, ఎలాంటి గొడవల్లో తల దూర్చరాదని హితవు పలికారు. మంచి నడవడికతో అందరితో మంచిగా మెలగాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మట్కా నిర్వహించినట్లు తేలితే కేసులు నమోదు చేస్తామన్నారు.

# కరుణించమ్మా రేణుకాఎల్లమ్మ

- భక్తుల కొంగుబంగారం ఎల్లమ్మ తల్లి
- రేపటి నుంచి అమ్మవారి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో రేణుకాఎల్లమ్మ



కొండపై వెలసిన ఎల్లమ్మ ఆలయం



ఆలయం సమీపంలో చెట్టు కింద సేద తీరుతున్న భక్తులు (ఫైల్)

ఆదోని అర్బన్: ఆషాఢ మాసమంతా ఆదోని రేణుకాఎల్లమ్మ భక్తులకు పండగే. పట్టణ శివారులోని దొడ్డనగేరి గ్రామ రోడ్డులో వెలసిన రేణుకాఎల్లమ్మ ఆషాఢ మాసోత్సవాలు ఈ మంగళవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఆషాఢ మాసం పూర్తయ్యే వరకు ప్రతి మంగళవారం అమ్మవారి ఆలయం వేలాది మంది భక్తులతో సందడిగా మారుతుంది. ఆలయంలో మాతకు ప్రత్యేక పూజలు జరుగుతాయి.

**రెండు మహోత్సవాలు**

ఆషాఢ మాసంలో నాలుగు మంగళవారాల్లో అమ్మవారి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. మొదటి మంగళవారం 9వ తేదీన, రెండో మంగళవారం 16న, మూడో మంగళవారం 23న గంపజాతర, నాలుగో మంగళవారం 30న జాతరతో ఉత్సవాలు ముగుస్తాయి. గంపజాతర రోజున భక్తులు పిండివంటలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. ముగింపు ఉత్సవాల రోజున పిండి వంటలతో పాటు మాంసాహారం నైవేద్యంగా సమర్పించడం సంప్రదాయంగా వస్తోంది.

**భక్తి పారవశ్యం**

ఎత్తైన కొండలు, పచ్చని చెట్ల మధ్య పశ్చిమ కొండల్లో రేణుకా ఎల్లమ్మ ఆలయం నిర్మించారు. ఇక్కడి వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ప్రతి మంగళవారం భక్తులు ఇంటిల్లిపాది ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పిస్తారు. అనంతరం పచ్చని చెట్ల మధ్య నైవేద్యం, ప్రసాదంతో పాటు వెంట తీసుకెళ్లిన పిండి వంటలను ఆరగిస్తారు. అనంతరం లింగ వయోభేదంతో సంబంధం లేకుండా ఆటపాటలతో ఆనందంగా గడుపుతారు. సాయంత్రం ఇంటికి చేరుకుంటారు. గంపజాతర, ముగింపు ఉత్సవాల రోజున పట్టణం నుంచే గాక కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు రేణుకా ఎల్లమ్మను దర్శించుకోవడానికి వస్తారు. కొండ ప్రాంతమంతా ఇసుకేస్తే రాలనంతగా జనం కనిపిస్తారు.

**❝ ఏర్పాట్లు చేశాం**



ఆషాఢమాసం ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. నాలుగు వారాల పాటు ఉత్సవాలు భారీగా జరగనున్నాయి. మూడో వారం గంప జాతర, నాలుగో వారం మహాజాతర వేడుకలు జరుగుతాయి. 3, 4 వారాల్లో భక్తులకు ఆలయ తరఫున అన్నదానం ఏర్పాటు చేస్తున్నాం. మండపాలు, మరుగుదొడ్లు, రోడ్ల మరమ్మతులు వంటి సౌకర్యాలు కల్పించాం. నాలుగో మంగళవారం తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీ ఎత్తున భక్తులు రానుండడంతో దర్శనానికి భారికేడ్లు ఏర్పాటు చేశాం.

– మోహన్‌ప్రసాద్, ఆలయ ధర్మకర్త

**చారిత్రక నేపథ్యం**

ఇక్కడి అమ్మవారి ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని ధర్మకర్త మోహన్‌ప్రసాద్ వివరించారు. త్రేతా యుగంలో జమదగ్ని అనే మహర్షి కర్ణాటక రాష్ట్రంలోని సౌదత్తి సమీపంలోని రాంశృంగ ప్రాంతంలో మలప్రభ నదీ సమీపంలో నివాసం ఉంటారు. ఆయన బ్రహ్మచారి, ఎంతో కోపిష్టి. యజ్ఞ అనే మహారాజు ఆధ్యాత్మిక చింతనకు సంబంధించిన అంశాలపై మునులకు పోటీలు నిర్వహించాడు. పోటీలో జమదగ్ని ప్రతిభను చాటాడు. ప్రతిభావంతుడైన జమదగ్నిని వివాహమాడతానని యజ్ఞ మహారాజు ఏకైక కూతురు రేణుకా ఎల్లమ్మ పట్టుబడుతుంది. ఇందుకు జమదగ్ని నిరాకరిస్తాడు. రేణుకా ఎల్లమ్మ గురువు అయిన దిగస్త్య మహాముని సూచన మేరకు జమదగ్ని వివాహమాడతాడు. వారికి ఐదుగురు సంతానం. వాసు, విశ్వవాసు, బృహద్యాను, బృత్వాకన్వ, రాంభద్రగా నామకరణం చేశారు. చివరి సంతానమైన రాంభద్ర శివపార్వతుల భక్తుడు. వారి వరంతో ఆయన పరశురామ్‌గా మారాడు. జమదగ్ని మహామునీశ్వరుడు మహాయజ్ఞాన్ని ప్రారంభించాడు. ఆ యజ్ఞానికి భార్య రేణుకాదేవిని ప్రతిరోజు మడితో మట్టికుండలో మలప్రభ నది నుంచి పవిత్ర జలాలు తీసుకొచ్చి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించే బాధ్యతను అప్పగించారు. అయితే ఏకాగ్రత ఏమాత్రం తప్పకూడదని, అలా తప్పితే మట్టికుండ పగిలిపోతుందని భార్యను హెచ్చరించాడు. రేణుకా ఎల్లమ్మను పరీక్షించేందుకు లక్ష్మి, విష్ణువు మారువేశంలో ప్రేమికులుగా నటించారు. దీంతో రేణుకా ఎల్లమ్మ మనస్సు చలించడంతో పవిత్ర జలాలున్న మట్టికుండ ముక్కలయ్యింది. ఉగ్రుడైన జమదగ్ని తల్లి శిరస్సును ఖండించాలని కుమారులను ఆదేశించాడు. ఇందుకు నలుగురు నిరాకరించడంతో తన ఆజ్ఞ శోత్రాలతో వారిని బూడిద చేశాడు. చిన్న కొడుకు పరశురామ్ మాత్రం ముందుకొచ్చి తల్లి రేణుకా ఎల్లమ్మ శిరస్సును తన కత్తితో ఖండించాడు. శిరస్సు ఎగిరి ఆదోని రాంజల కొండలో పడగా, మిగిలిన భాగమంతా సౌదత్తిలో ఉండిపోయింది. పరశురామ్ భక్తికి మురిసిపోయిన జమదగ్ని మూడు వరాలు కోరుకోవాలని చెప్తాడు. మొదటి, రెండో కోరిక తల్లికి, సోదరులకు తిరిగి ప్రాణాలు పోయాలని కోరతాడు. ఇందుకు సమ్మతించిన తండ్రి వారికి ప్రాణాలు పోశారు. నలుగురు సోదరులు చేతకాని వారు కావడంతో వారు జోగినులుగా బతుకుతారని శపిస్తాడు. జోగినుల వ్యవస్థ ఆనాటి నుంచి మొదలైనట్లు చరిత్రకారులు చెబుతారు. మొండెం పడిన సౌదత్తిలోనూ, తల పడిన ఆదోనిలోనూ రేణుకా ఎల్లమ్మకు ఆలయాలు వెలిశాయి. ఆలయాల్లో నాటి నుంచి సౌదత్తి, ఆదోనిలో ఆషాఢ మాసంలోనే రేణుకా ఎల్లమ్మవ్వ మాతకు ప్రతి మంగళవారం ప్రత్యేక ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త తెలిపారు. మూడో కోరిక తనకు అవసరమైనప్పుడు అడుగుతానని తండ్రి జమదగ్నికి పరశురాముడు చెబుతాడని తెలియజేశారు.

## కొలువుదీరిన పీర్ల దేవుళ్లు



గోనెగండ్లలో కొలువైన పీర్ల దేవుళ్లు

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లతో పాటు ఆయా గ్రామాల్లోని చావిడిలలో ఆదివారం పీర్ల దేవుళ్లు కొలువుదీరారు. కులమతాలకు అతీతంగా గ్రామ పెద్దలు పీర్ల చావిడికి వెళ్లి మేళతాళాలతో ఘనంగా పీర్లను ప్రతిష్ఠించారు. ఈ వేడుకలను మండల ప్రజలు కులమతాలకు అతీతంగా జరుపుకుంటారు. ఆయా గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో వేడుకలను జరుపుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఘర్షణలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలపాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ రామకృష్ణయ్య హెచ్చరించారు. సామరస్యంగా ప్రార్థనలు జరుపుకోవాలని సూచించారు. 14న చిన్న సరిగెత్తు, 15న పగటి సరిగెత్తు, 16న పెద్ద సరిగెత్తు, 17న మొహర్రం నిర్వహించనున్నట్లు ముజావర్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి

**మొహర్రంను ప్రశాంతంగా జరుపుకోండి**

కౌతాళం: మొహర్రం పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి సూచించారు. పండుగ జరుపుకోవడానికి అనుమతి కోసం వచ్చిన వివిధ గ్రామాల ప్రజలనుద్దేశించి ఎస్‌ఐ మాట్లాడుతూ.. హసన్, హుసేన్ త్యాగనిరతికి ప్రతీక అయిన మొహర్రం పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలను కలిసికట్టుగా సోదరభావంతో నిర్వహించుకోవాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు, అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మూగలదొడ్డిలో క్రికెట్ టోర్నీ

కోసిగి: మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో మొహర్రం వేడుకలను పురస్కరించుకుని ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్స్ ప్రకాష్, ఉసేని, వీరేష్ తెలిపారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు నగదును గ్రామానికి చెందిన ఆటో అశోక్, మంగలి సురేష్ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల జట్లు ఈ నెల 9వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 10వ తేదీన టోర్నమెంట్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. వివరాలకు ఫోన్ 79890 68828, 63033 62380 నంబర్లను సంప్రదించాలన్నారు.

## యువతి ఆత్మహత్యాయత్నం

ఆదోని అర్బన్: మండలంలోని సంతెకూడ్లూరు గ్రామానికి చెందిన ఓ యువతి కడుపునొప్పి తాళలేక ఆదివారం ఇంజిన్ ఆయిల్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. యువతి గత కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోందని దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న ఇంజిన్ ఆయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని తెలిపారు. అపస్మారక స్థితిలో ఉన్న యువతిని వైద్యం కోసం ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు బంధువులు చెప్పారు.



గోనెగండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళన దృశ్యం

## అపూర్వ సమ్మేళనం

గోనెగండ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం తిరిగి కలుసుకున్నారు. పదో తరగతి పూర్తి చేసుకొని 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గోనెగండ్లలోని బాషా ఫంక్షన్ హాలులో అపూర్వ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి ప్రారంభమైన సంబరాలు సాయంత్రం వరకు సాగాయి. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పూర్వ జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. 30 ఏళ్ల కిందట కలిసి చదువుకున్న తామందరికీ ఇప్పటికీ సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. ఎవరికీ ఏ చిన్న కష్టం వచ్చినా ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకుంటూ అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. అనంతరం అందరికీ జ్ఞాపికలను అందజేశారు.

## పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఎమ్మిగనూరురూరల్: పత్తి సాగులో సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటించాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.అశోక్‌కుమార్ సూచించారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. జిల్లాలో ముందస్తు వర్షాలకు సాగుచేసిన పత్తి పంట ప్రస్తుతం 20–30 రోజుల దశలో ఉందని సస్యరక్షణ పద్ధతులు పాటించాలని చెప్పారు. ఈ దశలో పంట కలుపు నివారణ కోసం అంతర సేద్యం చేయాలన్నారు. విత్తిన 25–30 రోజులప్పుడు అంతర కృషి చేయటానికి అవకాశం లేనప్పుడు గడ్డి జాతి మొక్కల నివారణకు ఎకరానికి 400 మి.లీ క్విజలోఫాస్ ఇథైల్ 5 శాతం ఇ.సి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వెడల్పులాంటి ఆకు కలుపు సమస్య ఎక్కువగా ఉంటే ఎకరానికి 250 మి.లీ పైరిథయోబ్యాక్ సోడియం 10 శాతం ఇ.సిను 200 లీటర్ల నీటిలో కలిసి పిచికారీ చేసుకోవాలని చెప్పారు. అలాగే ఈ దశలో పత్తి పైరుకు సరైన పోషకాలు అందేలా ఎకరానికి 20 కిలోల నత్రజని (44 కిలోల యూరియా), 10 కిలోల పొటాష్ (16 కిలోల మ్యూరియేట్ ఆఫ్ పొటాష్), 10 కిలోల భాస్వరం (22 కిలోల డైఅమ్మోనియం ఫాస్ఫేట్) ఎరువులు మొక్క మొదలు 7–10 సెం.మీ దూరం 5 సెం.మీ లోతులో వేయాలని చెప్పారు. రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే తెగుళ్ల నుంచి పైర్లను కాపాడుకోవచ్చన్నారు.

## బైకులు ఢీకొని నలుగురికి గాయాలు

ఆదోని అర్బన్: మండలంలోని 104బసాపురం గ్రామ సమీపంలో ఆదివారం రెండు బైకులు ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి. బాధితులు, ఇస్వీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 104 బసాపురం గ్రామ సమీపంలో రెండు బైకులు ఢీకొనడంతో మహేశ్వరి, విక్టోబారంగా, చిన్నారి యశ్వంత్, అక్షయకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు**



గయపడిన ఏమన్న

కోసిగి: మండల పరిధిలోని సజ్జల గుడ్డం గ్రామానికి చెందిన కురువ ఏమన్న అనే వ్యక్తి బైక్‌పై వెళుతూ అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆయన ఆదివారం బైక్‌పై మిరపకాయల సంచిని కట్టుకుని ఎమ్మిగనూరు వైపు వెళుతున్నాడు. పల్లెపాడు సమీపంలో మలుపు వద్ద బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి పడి పోయాడు. దీంతో శరీర భాగాలకు రక్త గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

## వర్షాలు కురవాలని కప్పల ఊరేగింపు



కొత్తూరులో కప్పలను రోకలికి కట్టి ఊరేగిస్తున్న చిన్నారులు

ఆదోని రూరల్: వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయని, సకాలంలో వర్షాలు కురవాలని మండలంలోని కొత్తూరు గ్రామంలో చిన్నారులు కప్పలకు పెళ్లిళ్లు చేసి గ్రామపురవీధులగుండా ఊరేగించారు. రోకలి బండకు కట్టిన జోలెలో రెండు కప్పలను ఉంచి ఇంటింటికీ తిరుగుతూ పసుపు, కుంకుమ సేకరిస్తూ విరాళంగా వచ్చిన డబ్బుతో గ్రామ దేవతలైన అయ్యమ్మవ్వ, బొడ్రాయి, శివలింగాలకు, గుంటి రంగస్వామి నీళ్లతో అభిషేకం చేసి ధూపదీప నైవేద్యాలతో కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని అయ్యమ్మవ్వ తల్లి ఆలయం వద్ద కప్పలకు పెళ్లిళ్లు చేశారు. గ్రామపెద్దలు మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురవాలని వరుణదేవుడిని ప్రార్థిస్తూ కప్పలకు పెళ్లి చేశామన్నారు. పూజారి హనుమంతు, విష్ణు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం



ఆదోనిలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆదోని రూరల్: పట్టణంలోని ఎస్సీ కాంప్లెక్స్, ఇంద్రానగర్, మండిగిరి, కల్లుబావి, రాయినగర్, ఇస్వీ గ్రామంలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పట్టణం, గ్రామాల్లో దండోరా వేయించి ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఎగురవేశారు. మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బైచిగేరి తిమ్మన్న మాదిగ, స్వామిదాసు, టి.ఈరన్న మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ పోరాటాలను కొనియాడారు. స్థానిక నాయకులు రవీంద్ర, సంజయ్, కేటీ రాజు, రామాంజనేయులు, గుమ్మల థామస్ తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలపై పోరాటం**

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో అనేక సమస్యలపై పోరాటం చేసిన ఘనత ఎమ్మార్పీఎస్‌దే అని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ చైతన్య పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ జెండాను మాదిగ ఉద్యోగ సమాఖ్య నాయకులు అంపయ్య ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం నుంచి చేసిన పోరాటాలను వివరించారు. ఎమ్మార్పీఎస్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామంలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామానికి ఎంఎస్‌పీ జిల్లా నాయకులు దుర్గప్ప మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సామేల్ మాదిగ చేరుకుని మండల అధికార ప్రతినిధి నరసింహులు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఏబీసీడీ వర్గీకరణ సాధనకు పోరాటాలు చేస్తున్నామన్నారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఉరుకుందప్ప, ఈరన్న, తిమ్మయ్య, తిక్కస్వామి, లింగన్న, హనమంతు, అంజినయ్య తదితరులు పాల్గొన్నారు.




ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న మాదిగ ఉద్యోగ సమాఖ్య నాయకుడు అంపయ్య

కౌతాళం: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 30వ ఆవిర్భావ దినోత్సవంను మండల పరిధిలోని గుడికంబాలి గ్రామంలో ఆదివారం జెండా ఆవిష్కరించి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రాజాబాబు, జిల్లా నాయకుడు దుర్గప్ప మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ మూడు దశాబ్దాలుగా సామాజిక న్యాయ సాధన, ఎస్సీ వర్గీకరణపై అకుంఠిత దీక్షతో నిస్వార్థంగా చేస్తున్న ఉద్యమం లక్ష్యానికి చేరువులో ఉందన్నారు. కార్యక్రమంలో ఆనంద్, నరసింహులు, ముఖేష్, రాజేంద్ర, సామేల్ తదితరులు పాల్గొన్నారు.

## 400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కోడుమూరు రూరల్: స్థానిక సెబ్ పరిధిలోని వెల్దుర్తి మండలం చిన్నకొలుముల గ్రామంలో నిర్వహిస్తున్న నాటుసారా బట్టీపై ఆదివారం సిబ్బందితో దాడులు నిర్వహించి నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. అలాగే కృష్ణగిరి మండలం సంగాల గ్రామంలో మధు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐ అలీబేగ్, సిబ్బంది హనుమంతు, విరుపాక్షిరెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.



చిన్నకొలుములపల్లిలో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

## కళ్ల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్ శర్మ

కర్నూలు(సెంట్రల్): సమాజంలోని ప్రతిఒక్కరూ కళ్ల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ ప్రసాద్ శర్మ సూచించారు. ఆదివారం లక్ష్మీనగర్‌లోని వికాస్ స్కూలులో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, సిరి, శ్రీదత్త మహిళా ఐక్య సంఘాల నిర్వహణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ బి.స్వాతి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రసాద్ శర్మ మాట్లాడుతూ..సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి రెండునెలలకొకసారి చివరి ఆదివారం బీపీ, షుగర్, మూర్ఛ వ్యాధులకు రూ.200కే రెండునెలలకు సరిపడా మందులను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సుందరయ్య కేంద్రం నాయకులు జేఎస్ శేషయ్య, రంగస్వామి, ఎల్లాగౌడ్, శేషాద్రి పాల్గొన్నారు.

## కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయ

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, ఆయాలు, రాత్రి కాపలాదారులకు ఉద్యోగ భద్రత కల్పించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు విజయ పేర్కొన్నారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..టీడీపీ ప్రభుత్వం పనిచేస్తున్న కార్మికులను తొలగించి తమ వారిని నియమించుకునేందుకు కుట్ర పన్నుతోందన్నారు. ఇప్పటికే కొన్ని చోట్లా కార్మికులను తొలగించారన్నారు. ఇందుకు అధికారులు కూడా సహకరిస్తుండడంతో కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. ఈ అంశంపై సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎండీ అంజిబాబు, నాయకులు లలితమ్మ, రజియా,సుజాత, రాజమణి పాల్గొన్నారు.

### వలసబాట

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి, బిలేహాల్ గ్రామాల నుంచి సుమారు 80 కుటుంబాలు ఆదివారం తెలంగాణ రాష్ట్రానికి వలస వెళ్లారు. స్థానికంగా ఉపాధి పనులు లేకపోవడం, వ్యవసాయ పనులు ప్రారంభం కాకపోవడంతో వలస వెళ్తున్నట్లు కూలీలు తెలిపారు. అక్కడ నీరావరి పొలాల్లో వ్యవసాయ దినసరి కూలి పనులు దొరుకుతున్నట్లు చెప్పారు.



తెలంగాణకు పయనమవుతున్న కూలీలు